నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 6 జనవరి 2024 | KAMAREDDY



## 20న నవోదయ ప్రవేశ పరీక్ష

నిజాంసాగర్, జనవరి 5: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరానికి నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం 522 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి ఈనెల 20న ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ navodaya.gov.in నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఏమైనా సమస్యలు ఉంటే నవోదయ పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.


బాల్కొండ మండలం వన్నెల్(బీ) గ్రామంలో సాయంత్రం 4గంటలకు అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఇంటర్వ్యూ

**ప్రజాపాలన అభయహస్తం** దరఖాస్తుల ప్రక్రియ కోసం ప్రజలెవరూ ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవల వద్ద బారులు తీరాల్సిన అవసరం లేదని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దరఖాస్తులకు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ఇస్తే సరిపోతుందని చెప్పారు. చాలా మంది వదంతులను నమ్మి అనవసరంగా ఇతరత్రా ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏదైనా ధ్రువీకరణ పత్రాలు అవసరమైతే ప్రభుత్వమే ముందస్తుగా అప్రమత్తం చేస్తుందని పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీపై సీరియస్‌గా దృష్టి సారిస్తామని చెప్పారు. నిర్ణీత రుసుములనే తీసుకోవాలని, ప్రజల అవసరాలను సొమ్ము చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ శుక్రవారం నుంచే ఆన్‌లైన్‌లోకి డాటా ఎంట్రీ ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీల్లో సభలు పూర్తి చేశామన్నారు. ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ మున్సిపాలిటీలు, నిజామాబాద్ నగర పాలక సంస్థలన్నింటిలో కలిపి మొత్తం 146 డివిజన్/వార్డుల్లోనూ సభలను పూర్తి చేసినట్లు 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు వివరించారు.

–నిజామాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



# మీ సేవ దోపిడీని సహించం..

అక్రమ వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెడతాం

- వాస్తవమని తేలితే చర్యలు..
- ప్రశాంతంగా ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ
- ఈ నెల 17వ తేదీ వరకు డాటా ఎంట్రీ చేపడతాం..
- ఆదాయ, కుల ధ్రువీకరణ ఇప్పుడేం అవసరం లేదు
- 530 జీపీల్లో సభలు, 146 వార్డుల్లో సభలు పూర్తి
- 'నమస్తే తెలంగాణ'తో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**నమస్తే : కొత్త ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజాపాలన అభయహస్తం పథకాల దరఖాస్తు ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది?**

**కలెక్టర్ :** గత డిసెంబర్ 28వ తేదీ నుంచి ప్రజాపాలన అభయహస్తం పథకాలకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. విజయవంతంగా దరఖాస్తుల స్వీకరణ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. జిల్లాలో 530 జీపీలు, మూడు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 146 డివిజన్/వార్డుల్లో వేగంగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్నది. అన్నిచోట్ల ప్రభుత్వం ఆదేశించినట్లుగానే గ్రామ సభలు, వార్డు సభలను పూర్తి చేశాం. ప్రజలతో మమేకమై సభలు నిర్వహించాం. సభలకు విశేష స్పందన వచ్చింది. ప్రజల అభ్యంతరాలు, సలహాలు, సూచనలను నమోదు చేశాం.

**నమస్తే : జిల్లాలో ఎల్పీజీ ఏజెన్సీల్లోనూ ఇదే తంతు జరుగుతోంది. ఈ-కేవైసీ పేరిట ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. మీ దృష్టికి వచ్చిందా?**

**కలెక్టర్:** ఎల్పీజీ సిలిండర్ల కోసం ఈ -కేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం చెప్పలేదు. అలాంటి అవసరమే రాదని నేను భావిస్తున్నా. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మి ఎవ్వరూ ఆగం కావొద్దు. ఇకపోతే ఎల్పీజీ ఏజెన్సీల్లో ఈ-కేవైసీ పేరిట బహుమతులు అంటగట్టి డబ్బులు అదనంగా దండుకుంటున్నారని తెలిసింది. ఈ విషయంపై ఇప్పటికే విచారణ చేయించాం. వినియోగదారుల ఇష్టపూర్వకంగానే సిలిండర్ పైప్‌లను ఇతరత్రా విక్రయించాలి. బలవంతంగా అంటగడితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో ఎల్పీజీ ఏజెన్సీ బాధ్యులతో ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించాం.

**నమస్తే : నిజామాబాద్‌కు కలెక్టర్‌గా విధులు చేపట్టి దాదాపుగా ఏడాది కావొస్తున్నది. ఎలా అనిపిస్తోంది?**

**కలెక్టర్ :** గతేడాది ఫిబ్రవరి ఒకటిన నిజామాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. ఈ పదకొండు నెలల కాలంలో గత ప్రభుత్వ పథకాల అమలుతో పాటు కీలకమైన అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొన్నాను. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా కృషి చేయడం సంతోషంగా ఉంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయడం వరకు అన్ని సవ్యంగా జరిగాయి. ఏ చిన్న సంఘటన కూడా జరగకుండా పోలింగ్ నిర్వహించగలిగాం. రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికల అనుభవం కాస్త ఈ ప్రాంతంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఉపయోగపడుతుందని భావిస్తున్నా. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా క్రియాశీలకంగా పని చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఓటరు జాబితా రూపకల్పనలో బిజీగా ఉన్నాం. జనవరి 6న ఓటరు జాబితా ముసాయిదా వెలువడుతుంది. అసెంబ్లీ ఎన్నికలకు కౌంటింగ్ కేంద్రాన్ని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించాం. లోక్‌సభకు డిచ్‌పల్లి సీఎంసీలో కౌంటింగ్ చేపట్టబోతున్నాం.



**నమస్తే : ఇన్‌కం సర్టిఫికెట్ కోసం రూ.500, కుల ధ్రువీకరణ పత్రం కోసం రూ. వెయ్యి చొప్పున మీ సేవ నిర్వాహకులు వసూలు చేస్తున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై మీ స్పందన?**

**కలెక్టర్ :** వాస్తవానికి ఈ విషయం మా దృష్టికి రాలేదు. మీసేవల్లో వసూళ్లపై తప్పకుండా విచారణ చేపడతాం. ర్యాండమ్‌గా తనిఖీలకు ఆదేశాలిస్తా. ఒకవేళ ఎవరైనా నిర్ణీత రుసుము కాకుండా అదనంగా డబ్బులు డిమాండ్ చేసినట్లుగా మా దృష్టికి వస్తే మాత్రం వదిలేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా చైతన్యంగా ఉండాలి. మీ సేవల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుములను మాత్రమే చెల్లించాలి. అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నాం.

**నమస్తే : దరఖాస్తుల్లో ఎక్కువగా ఏ పథకాల కోసం ప్రజలు ఆసక్తి చూపుతున్నట్లు గమనించారు?**

**కలెక్టర్:** ముఖ్యంగా అన్ని వర్గాల వారు అర్హతలను అనుసరించి దరఖాస్తులు ఇస్తున్నారు. ఇందులో ఎక్కువగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందించే రూ.2500 కోసం దరఖాస్తులు పెద్దసంఖ్యలో వచ్చినట్లు కనిపిస్తోంది. ఎల్పీజీ సిలిండర్ రూ.500 స్కీమ్ కోసం కూడా దరఖాస్తుదారులు ఆసక్తిగా ఉన్నారు. 200 యూనిట్ ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లకు కూడా ప్రజలు దరఖాస్తు చేస్తున్నారు. ఒకే దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుడు టిక్ చేసిన అంశాలనే ప్రామాణికంగా తీసుకుంటున్నాం. వారి ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులు తప్పకుండా జత చేస్తున్నాం. డాటా ఎంట్రీలో ఈ వివరాలన్నింటినీ పొందుపరుస్తాం. ఆన్‌లైన్ పోర్టల్‌లో అభయహస్తం పథకాలకు సంబంధించిన దరఖాస్తు డిస్‌ప్లే అవుతుంది. అందులోనే ఈ వివరాలన్నింటినీ నమోదుచేస్తాం.

**నమస్తే : ఆయా పథకాలకు దరఖాస్తు చేసిన వారంతా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం బారులు తీరుతున్నారు. వీరికి మీరిచ్చే సలహా?**

**కలెక్టర్ :** ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదాయ, కుల ధ్రువీకరణకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లను అడగలేదు. దరఖాస్తులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జత చేస్తే సరిపోతుంది. ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చెప్పుడు మాటలు విని అనవసరంగా సమయాన్ని వృథా చేసుకోవద్దని నా సలహా. ఏమైనా అనుమానాలుంటే స్థానిక ఎంపీడీవోలు, తహసీల్దార్లను కలిస్తే వారు నివృత్తి చేస్తారు. ఇప్పుడైతే అలాంటి డాక్యుమెంట్లను మేము తీసుకోవడం లేదు. ఎవ్వరూ ఏ కౌంటర్లలోనూ అడగడం లేదు.

**నమస్తే : ఒకే ఇంటి నుంచి ఒకటి కన్నా ఎక్కువ దరఖాస్తులు సమర్పించవచ్చా?**

**కలెక్టర్ :** అలాంటిదేమీ ఉండదు. దరఖాస్తులను క్రమపద్ధతిలో ఆన్‌లైన్‌లో పొందుపర్చిన తర్వాత ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో వివరాలను పోల్చి చూస్తారు. ఒకే ఇంటికి ఒకే దరఖాస్తు సరిపోతుంది. ఒకే దరఖాస్తులో అన్ని పథకాలకు సంబంధించిన ఆప్షన్లు ఉన్నాయి. ఒకవేళ ఎక్కువగా దరఖాస్తులు సమర్పించినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చాలా కుటుంబాల్లో ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి జీవనం సాగిస్తున్న వారే ప్రత్యేకంగా దరఖాస్తులు అందించారు. నిజామాబాద్‌లో దాదాపుగా 4లక్షల 5వేల కుటుంబాలుంటే ఇందులో ఇప్పటికే 4లక్షల 2వేల దరఖాస్తులు వచ్చాయి. శనివారం పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## ప్రజాపాలన.. ఇష్టారాజ్యం

- వన్నెల్(బీ) గ్రామంలో నిర్ణీత సమయానికన్నా ముందే వెళ్లిపోయిన సిబ్బంది
- అభయహస్తం దరఖాస్తులకు నేడే చివరి గడువు
- ఆందోళనలో ప్రజలు

బాల్కొండ, జనవరి 5 : పేదలందరికీ ఆరు గ్యారెంటీ పథకాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నది. చాలా గ్రామాల్లో అధికారులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత నెల 28న ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమం నేటి (శనివారం)తో ముగియనున్నది. దరఖాస్తు ఫారానికి జత చేయాల్సిన వివరాలపై రెండుమూడు రోజుల వరకు స్పష్టత లేకపోవడంతో చాలా మంది కేవలం సమాచారం తీసుకొని వెళ్లిపోయారు. జనంలో ఇలాంటి గందరగోళం నెలకొనగా.. ప్రభుత్వం ఇచ్చిన గడువు సమీపించింది. దీంతో దరఖాస్తులు అందించేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాల్సి ఉండగా, బాల్కొండ మండలంలోని వన్నెల్(బీ) గ్రామంలో సిబ్బంది శుక్రవారం 4 గంటలకే అన్నీ సర్దుకొని వెళ్లిపోయారు. దరఖాస్తు ఫారాలు అందించేందుకు వచ్చిన ప్రజలు ఖాళీ కుర్చీలు, టేబుళ్లను చూసి విస్తుపోయారు. సమయం అయిపోయిందని అక్కడ ఉన్నవారు సమాధానం ఇవ్వడంతో చేసేదేమీ లేక వెనుదిగిరిగారు. దరఖాస్తులు అందించేందుకు శనివారంతో గడువు ముగియనుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## సౌత్ క్యాంపస్‌ను వర్సిటీగా తీర్చిదిద్దుదాం..

శాస్త్రవేత్త, సామాజికవేత్త పైడి ఎల్లారెడ్డి

దక్షిణ ప్రాంగణంలో ఓపెన్ డయాస్ నిర్మాణానికి భూమిపూజ


సౌత్ క్యాంపస్‌లో ఓపెన్ డయాస్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

భిక్కనూరు, జనవరి 5: అన్ని సౌకర్యాలు ఉన్న సౌత్ క్యాంపస్‌ను యూనివర్సిటీగా తీర్చిదిద్దుదామని కామారెడ్డి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త, సామాజికవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులకు జపాన్‌లో అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని టీయూ సౌత్ క్యాంపస్‌లో పైడి ఎల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఓపెన్ డయాస్ నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పైడి ఎల్లారెడ్డి, టీయూ రిజిస్ట్రార్ యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ..తాను ఈ ప్రాంతానికి చెందిన వాడినని, వర్సిటీకి సహకారం అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. దక్షిణ ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు ఉన్నా కార్యక్రమాల నిర్వహణ కోసం ఓపెన్ డయాస్ (బహిరంగ వేదిక) లేకపోవడం వెలితిగా అనిపించిందని, అందుకే తాను స్వచ్ఛందంగా నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. విదేశీ వర్సిటీలతో సౌత్ క్యాంపస్‌ను అనుసంధానం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన జపాన్ సహకారంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల ఆకాంక్షమేరకు తాను మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు మోహన్ బాబు, హరిత, ప్రతిజ్ఞ, సబిత, కవితా తోరణ్, నారాయణ, వార్డెన్లు యాలాద్రి, సునీత, ఏపీఆర్వో సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రూప్స్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ

కామారెడ్డి/ నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 5 : ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగయువత కోసం గ్రూప్- 1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభంకానున్నాయని టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర వెంకన్న తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ తరగతులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో www. tsbcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 5 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 08462-241055 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## ప్రమాదాలను నివారించాలి..

విలువైన ప్రాణాలు కాపాడాలి

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, జనవరి 5 : జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులోరోడ్డు భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణం గా ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా, రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని సూచించా రు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పోలీసు కళాబృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దాబాల్లో పనిచేసేవారికి, యువతకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. జాతీయ ప్రాధికార సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సీఎస్ రావు, డీఎస్పీ ప్రకాశ్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, ఆర్టీవో వాణి, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి, జనవరి 5 : కామారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఉపకార వేతనాల (2023-24) కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో http:// telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లుతెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తా

సిరికొండ, జనవరి 5: ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించారని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. అంతకుముందు తాటిపల్లిలో గ్రామంలో హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం చీమన్‌పల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజాసేవ చేసే బాధ్యతను అప్పగించారని, మీవాడిగా ప్రజల్లోనే ఉంటానని అన్నారు. ఇది ప్రజాపాలన అని, ప్రజలు స్వేచ్ఛగా పనులను చేసుకోవాలని సూచించారు. పోడు రైతుల సమస్యలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, డీసీసీబీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, శేఖర్‌గౌడ్, డీసీసీ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎర్రన్న, నాయకులు ఉన్నారు.


సిరికొండ మండలం చీమన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



గుర్జాల్ తండాలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

## ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం

సదాశివనగర్/గాంధారి, జనవరి 5 : కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలుపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అభయ హస్తం సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి, గాంధారి మండలం గుర్జాల్ తండాలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలు ఎలాంటి సమస్యలపై దరఖాస్తులు అందజేసినా స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు హిమబిందు, జానకి, ఎంపీడీవో లక్ష్మి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.